తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు

ఆమనగల్లులో తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న వారి పిల్లలు

ఆమనగల్లు, మే 19 : తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు బట్టు నర్సిరెడ్డి, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, శృతిలయ కల్చరల్ అకాడమీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిత్తరంజన్‌దాస్ అన్నారు. ఆమనగల్లులో వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి సంగీత శిక్షణా శిబిరంలో భాగంగా ఆదివారం తల్లిదండ్రుల పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలు కడిగి నమస్కరించుకున్నారు. పాదపూజ సమయంలో విద్యార్థులు తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు.

ఈ సందర్భంగా తల్లిదండ్రుల ప్రాధాన్యతను తెలియజేసే పాటలను రాగయుక్తంగా పాడారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ వెలికితీయుటకు శిక్షణా శిబిరాలు తోడ్పడుతాయని ప్రధాన వక్తలు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం శంకర్, జనరల్ సెక్రటరీ విజయ్ కుమార్, నాయకులు రాము, వెంకటయ్య, సుఖజీవన్‌రెడ్డి, శిక్షణా శిబిరం ఇన్‌చార్జి లక్ష్మమ్మ, అకాడమీ సభ్యులు అభినవ్‌రెడ్డి, శ్రీశైలం, శేఖర్, వలంటీర్లు ఉన్నారు.

కరెంటు వాడకం తగ్గింది

రెయిన్ ఎఫెక్ట్..!

సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ):గ్రేటర్ హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గిపోయింది. ఈ ఏడాది వేసవి సీజన్ ప్రారంభమైన మార్చి నెల నుంచి పెరుగుతూ వచ్చిన విద్యుత్ డిమాండు మే 15 నుంచే ఒక్కసారి తగ్గుముఖం పట్టింది. ఈనెల 4న రోజు వారీ విద్యుత్ వినియోగం 90.68 మిలియన్ యూనిట్లు ఉంటే, మే 6న ఫీక్ అవర్ డిమాండ్ 4352 మెగావాట్లుగా నమోదైంది. సరిగ్గా 11 రోజుల తర్వాత నుంచి విద్యుత్ వినియోగం క్రమంగా తగ్గుతూ వస్తూనే ఉంది. తాజాగా శనివారం మే 18న ఒక రోజు విద్యుత్ వినియోగం 65.63 మిలియన్లకు తగ్గిపోగా, పీక్ అవర్ డిమాండ్ 3069 మెగావాట్లుగా ఉంది. ఆదివారం సైతం నగరంలో ఉదయం నుంచి వాతావరణం చల్లబడి ఉండటం, మధ్యాహ్నం నుంచే పలు చోట్ల వర్షాలు కురవడంతో ఫీక్ అవర్ డిమాండ్ 3000 మెగావాట్ల వరకు, రోజు వారీ విద్యుత్ వాడకం 61 మిలియన్ యూనిట్లు ఉంటుందని, భారీ వర్షాల నేపథ్యంలోనే విద్యుత్ డిమాండ్ తగ్గిపోయిందని అధికారులు పేర్కొంటున్నారు.

మేలో హెచ్చుతగ్గులు

వాతావరణ శాఖ సూచించిన మేరకు మరి కొన్ని రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో మేలో విద్యుత్ వినియోగం హెచ్చు తగ్గులతో నమోదవుతోంది. ఇక ఈ వేసవి సీజన్ ముగిసేనాటికి విద్యుత్ డిమాండ్ మే 4న నమోదైన దాని కంటే పెరిగే అవకాశం లేకపోవచ్చని ఆ శాఖ అధికారులు తెలిపారు. కాగా, గతేడాది (2023)మేలో అత్యధిక పీక్ అవర్ డిమాండ్ 3756 మెగావాట్లు, వినియోగం 79.33 మిలియన్ యూనిట్లుగా నమోదైంది.

61 ఎంవోయూలకు పడిపోయిన వినియోగం

మేలోనే ఒక్కసారిగా 29 మిలియన్ యూనిట్లు తగ్గుదల

ఈనెల 15 నుంచి గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్, వినియోగం ఇలా...

తేదీ	మెగావాట్లు	మిలియన్ యూనిట్లు
15	3564	75.36
16	3530	71.44
17	3251	67.34
18	3069	65.63
19	3000	61(అంచనా)

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

- క్రీడాప్రాంగణాలను ఉపయోగంలోకి తీసుకురావాలి
- ప్రతి గ్రామానికి క్రీడా కిట్లు అందజేయాలని ప్రత్యేకాధికారులను కోరుతున్న ప్రజలు, క్రీడాకారులు

వికారాబాద్, మే 19 : గ్రామీణ ప్రాంతాల్లోనే క్రీడాకారులు తయారవుతారు. గ్రామీణ ప్రాంత క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహిస్తూ యువత తాము ఎంచుకున్న క్రీడల్లో శిక్షణ పొందడానికి గత ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారిలోని క్రీడా నైపుణ్యాలను వెలికి తీయాలన్న ప్రభుత్వ లక్ష్యం ఉన్నతంగా ఉన్నా క్షేత్ర స్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతున్నది. వికారాబాద్ మండలంలో 21 గ్రామపంచాయతీలుండగా.. 20 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ప్రతి క్రీడా ప్రాంగణం సుమారు ఎకరా స్థలం తగ్గకుండా ఉండాలని అధికారులకు ఆదేశాలున్నాయి. ప్రతి గ్రామంలోని రెవెన్యూ భూమిని అధికారులు కేటాయించారు. క్రీడా ప్రాంగణం పేరుతో గ్రామాల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. అందులో విద్యార్థులు, యువకులు వ్యాయామం చేసుకుంటూ తమ ఆరోగ్యాలను కాపాడుకుంటారని భావించారు. ప్రతి గ్రామపంచాయతీకి ఆట వస్తువులు (కిట్లు) అందించారు. వీటి విలువ సుమారు రూ.25వేలు ఉంటుందని అప్పటి అధికారులు తెలిపారు. ఈ కిట్టులో క్రికెట్ కిట్, వాలీబాల్, డంబుల్స్, షటిల్స్ తదితర ఆట వస్తువులు ఉన్నాయి. ఈ కిట్లు గ్రామ పంచాయతీలకు వచ్చిన కొత్తలో కనిపించాయి. కొన్ని గ్రామ పంచాయతీల్లో మళ్లీ కనిపించడంలేదు. వేసవి కాలం సెలవులు ఉండటంతో విద్యార్థులు, యువతకు ఈ కిట్లు ఎంతో ఉపయోగపడతాయని గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ప్రోత్సాహం లేకపోవడంతో గ్రామీణ క్రీడాకారులు కనుమరుగయ్యే ప్రమాదం లేకపోలేదు. గ్రామీణ క్రీడాకారులకు ఈ కిట్లను అందించి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీటిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామపంచాయతీలకు ఆట వస్తువుల కిట్లు అందజేస్తున్న అధికారులు (ఫైల్)

క్రీడా కిట్లను ఉపయోగంలోకి తీసుకురావాలి

గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అప్పటి ప్రభుత్వం గ్రామపంచాయతీలకు క్రీడా కిట్లను అందజేసింది. ప్రస్తుతం క్రీడా ప్రాంగణం ఉన్నా.. యువకులు ఆడేందుకు సిద్ధంగా ఉన్నా ఆట వస్తువులు లేక నిరుత్సాహ పడుతున్నారు. గ్రామంలో చాలా మంది విద్యార్థులు, యువకులకు క్రీడలపై ఆసక్తి ఉన్నది. ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఖర్చు చేసి ఆట వస్తువులను అందజేయాలి. వేసవి సెలవులు ఉన్నందున విద్యార్థులు, యువకులు క్రీడలు ఆడేందుకు ముందుకు వస్తారు. అధికారులు చొరవ చూపి క్రీడాకారులకు కిట్లు అందింది ప్రోత్సహించాలి.

- రమేశ్, మదన్‌పల్లి, వికారాబాద్

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మిథిలానగర్, భవాని నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

ముంపు సమస్య లేకుండా చూడండి

- ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, మే 19 : మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ముంపు సమస్య పునరావృత్తం కాకుండా చూడాలని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మిథిలానగర్, భవానీ నగర్‌లో పర్యటించి కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలాపూర్ చౌరస్తాలో ఓ ప్రైవేట్ దవాఖానను ప్రారంభించారు. వర్షాకాలంలో కాలనీలలో వరద నీరు నిల్వకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ముంపు కాలనీల ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. నాలా పనులు పూర్తి చేయకుండా వదిలేసిన వాటిని పూర్తిచేయించాలన్నారు. చెరువు పరిసరాలలో ఉన్న కాలనీలకు వర్షం నీరు రాకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేయాలని, వరద కాల్వలకు అడ్డుగా ఉన్న వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముంపు కాలనీలలో అధికారులు పర్యటించి సమస్యలను తెలుసుకొని త్వరగా పరిష్కరించాలని, ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని తెలిపారు.

డేటింగ్ యాప్‌తో ఎర.. దోపిడీ

వనస్థలిపురం, మే 19 : డేటింగ్ యాప్ ద్వారా అమాయకులకు ఎరవేసి, దోపిడీ చేస్తున్న ముఠాను వనస్థలిపురం పోలీసులు ఆదివారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లాకు చెందిన శోభన్‌బాబు (30) గ్రిండర్ గై డేటింగ్ యాప్‌లో లాగిన్ అయ్యాడు. అమ్మాయి పేరుతో పరిచయమైన ఓ వ్యక్తి ఆదివారం గుర్రంగూడ అటవీ ప్రాంతంలోకి ఒంటరిగా రావాలని ఛాటింగ్ ద్వారా చెప్పాడు. ఆకర్షణకు గురైన బాధితుడు ఆదివారం గుర్రంగూడ అటవీప్రాంతానికి వెళ్లాడు. అక్కడికి వచ్చిన తర్వాత కొంత మంది అతడిని పట్టుకుని బెదిరించారు. అతడి వద్ద ఉన్న 2 తులాల బంగారు గొలుసు, కొంత నగదు లాక్కొని పంపించారు. దీంతో బాధితుడు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.దర్యాప్తు చేపట్టిన పోలీసులు దోపిడీకి పాల్పడిన వారిని గుర్తించారు. నల్గొండ జిల్లాకు చెందిన రమావత్ కిరణ్‌కుమార్ (23), కొర్ర బాలు (23), వారితోపాటు రమావత్ రోహిత్, నెనావత్ మకత్‌లాల్, కుక్కల నాగరాజును పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడు పాత్లావత్ రమేశ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పూర్తి కావచ్చిన మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్

ఆనందంగా ఉందంటూ కేటీఆర్ ట్వీట్

సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్‌లో పార్కింగ్ సమస్యకు పరిష్కారం చూపేందుకు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ చేపట్టిన అత్యాధునిక మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్సు పనులు చివరి దశకు చేరుకున్నాయి. నాంపల్లి మెట్రో స్టేషన్, గాంధీ భవన్ మెట్రో స్టేషన్‌ల మధ్య విశాలమైన స్థలంలో నిర్మిస్తున్న మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్సు నిర్మాణ పనులు ప్రస్తుతం చివరి దశలో ఉన్నారు. త్వరలోనే ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కోర్ సిటీలో ఎంతో కీలకమైన నాంపల్లిలో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అలాంటి వారు తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి చక్కని పరిష్కారం చూపుతూ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంలో రూ.80 కోట్లతో నిర్మాణం చేపట్టింది. పూర్తి కావచ్చిన పనులను హైదరాబాద్ మెట్రో రైలు ఎం.డీ ఎన్వీఎస్ రెడ్డి ఇటీవలే పర్యవేక్షించారు. ఈ మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్సు ప్రారంభమైతే పార్కింగ్ స్థలంలో 250 కార్లు, 200 ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

మొట్ట మొదటి పీపీపీ ప్రాజెక్టు అంటూ కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్ నగరంలో పార్కింగ్ సమస్యలను దూరం చేసేందుకు 2016-2017 సంవత్సరంలో మొట్ట మొదటి సారిగా పీపీపీ విధానంలో మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ప్రాజెక్టును గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. నిర్మాణ సమయంలో చిన్న అవాంతరాలు రావడంతో ప్రాజెక్టు అనుకున్న సమయంలో పూర్తి కాలేదని, చివరకు చక్కగా నిర్మాణం పూర్తయినందుకు చాలా ఆనందంగా ఉన్నదని, కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని ముందుకు తీసుకువెళ్తుందని, మేము అనుకుంటున్నట్లుగా కీలకమైన జంక్షన్లు, మెట్రో స్టేషన్లు, వాణిజ్య కేంద్రాలతో ఇది అనుసంధానం కావడం వల్ల పార్కింగ్ సమస్య తగ్గుందని కేటీఆర్ ట్వీట్ చేశారు.

పిల్లల కంటి క్యాన్సర్‌పై అవగాహన

కొండాపూర్, మే 19 : పిల్లల్లో వచ్చే కంటి క్యాన్సర్ (రెటినోబ్లాస్టోమా)పై అవగాహన కల్పించేందుకు ఆదివారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'వైటథాన్ రన్' 6వ ఎడిషన్‌ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాదాపూర్ జోన్ డీసీపీ డాక్టర్ వినీత్ జీ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి రన్‌ని ప్రారంభించారు. వైటథాన్ రన్ ద్వారా సమీకరించిన నిధులను రెటినోబ్లాస్టోమాతో బాధపడుతున్న పేద పిల్లల వైద్యానికి వినియోగిస్తున్నారు. ఈ రన్‌లో 2వేలకు పైగా ఔత్సాహికులు పాల్గొన్నారు. పిల్లల్లో వచ్చే కంటి క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించేందుకు ఇలాంటి రన్‌లను నిర్వహించడం అభినందనీయమని డీసీపీ వినీత్ అన్నారు. రెటినోబ్లాస్టోమా వ్యాధిపై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. పేద పిల్లల వైద్యానికి ప్రైవేట్ దవాఖానలు సైతం సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని తెలిపారు.

ఏఐ టెక్నాలజీతో నూతన ఆవిష్కరణలు

రాష్ట్ర ఐటీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్

సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): కొత్తగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించేలా టీ హబ్ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని, ఔత్సాహికులు ఏఐపై ఎక్కువగా దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ పేర్కొన్నారు. ఆదివారం టీ హబ్‌లో జరిగిన మ్యాథడేమియా-2024 కార్యక్రమంలో ఆయన ముఖ్య అథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ రంగంలో ఇక నుంచి ఎక్కువ భవిష్యత్తు, ఉజ్వల అవకాశాలు ఉన్న టెక్నాలజీల్లో ఏఐ, ఎంఎల్ (మెషిన్ లర్నింగ్)లు కీలకంగా మారనున్నాయని తెలిపారు. ఏఐ టెక్నాలజీతో నూతన ఆవిష్కరణలు చేసేందుకు విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఏఐ, ఎంఎల్ టెక్నాలజీలకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి టీ హబ్, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ), ఏఐ, ఎంఎల్ టెక్నాలజీ హబ్ మ్యాథ్‌లతో కలిసి సంయుక్తంగా మ్యాథడేమియా-2024ను నిర్వహించారన్నారు. టీ హబ్ సీఈఓ మహాంకాళి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ మ్యాథడేమియా - 2024 ద్వారా 50కిపైగా యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఏఐ, ఎంఎల్ టెక్నాలజీలో సరికొత్త ఆవిష్కరణలు చేసే వారిని ప్రోత్సహించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాథ్ సంస్థ సీఈఓ రాహుల్ పైత్, ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ ఓఎస్‌డీ రమాదేవి లంక, పద్మశ్రీ అవార్డు గ్రహీత, టీహబ్ వ్యవస్థాపక సభ్యులు బీవీఆర్ మోహన్ రెడ్డి, డీఎస్‌టీ సైంటిస్టు శార్దూల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

పచ్చని దారి.. పులకించదా మది!

మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం వనస్థలిహిల్స్‌లో పచ్చదనం వాహనదారులను ఆకట్టుకుంటున్నది. రోడ్లకు ఇరువైపులా భారీ వృక్షాలు ఉన్నాయి. అవి నీడతోపాటు పచ్చని పూలతో అలరిస్తున్నాయి. సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు పూలన్నీ రోడ్లపై పడటం, ఆ సమయంలో వాహనాలు పెద్దగా వెళ్లకపోవడంతో రోడ్డంతా ఇలా పచ్చగా మారి ఆకట్టుకుంటున్నది. ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకింగ్‌కు వెళ్లే వారితో పాటు వాహనదారులు పూలందాలను చూసి పరవశించిపోతున్నారు.

- పెద్దఅంబర్‌పేట, మే 19

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, మే 19 : జిల్లాలో నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వానకాలం సాగు ప్రారంభమవుతున్న సమయాన్ని దృష్టిలో ఉంచుకొని కొందరు నేరగాళ్లు అమాయక రైతులకు నష్టం కలిగించేలా నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలను అమ్ముతారన్నారు. ఈ విషయంపై జిల్లాలోని రైతులు అవగాహన పెంచుకోవాలని, ఎవరైనా నకిలీ, కాలం చెల్లిన, ప్రభుత్వ నిషేధిత మందులు/విత్తనాలు అమ్మితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ అధికారులు జిల్లాలోని ఇతర అధికారులతో కలిసి విత్తనాలు, ఎరువుల దుకాణాలపైన దాడులు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా పరిధిలో నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని లేదా జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులకుగాని డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. నకిలీ, కాలం చెల్లిన విత్తనాల కేసులు నమోదైన వారిపై పీడీ యాక్ట్‌లు కూడా పెట్టనున్నట్లు ఎస్పీ స్పష్టం చేశారు.